



వానలు రాక.. వరద పెరగక!

ధవళేశ్వరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వానలు రాక.. గోదావరి పెరగడంలేదు.. గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంది. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 1,78,415 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 5వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టా ప్రధాన పంట కాలువకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 7 వేల క్యూసెక్కులు చొప్పున మొత్తం 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 19.90 అడుగులకు చేరుకుంది.

గేటు దాటాలన్నా.. టైమింగ్స్!



ఈ గేటుకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.. ఒకరోజు మూసేసినా వేలాది మందికి ఇబ్బంది తప్పదు.. ఉభయగోదావరి జిల్లాల ప్రజానీకం ఈ గేటు దాటకుండా ఉండరు.. అందుకే నిత్యం రద్దీగానే ఉంటుంది.. ఇంతకీ ఈ గేటు ఎక్కడిదంటే నిడదవోలు రైల్వే గేటు.. రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లి గూడెం వెళ్లాలన్నా తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం రావాలన్నా ఇదే దగ్గరి దారి కావడంతో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తారు. ఈ రైల్వే గేటును బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైల్వే గేటు వద్ద మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా గేటు మూసి వేస్తున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. - **నిడదవోలు**

మేలుకొలుపు!

ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్ అండ్ గో


అర్ధరాత్రి వేళ వాహనాలు తనిఖీ చేసి నిద్రమత్తులో ఉన్నడ్రైవర్లతో ఫేస్ వాష్ చేయిస్తున్న పోలీసులు

రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి.. ప్రమాదం ఎలా జరిగిందో కూడా అంచనా వేయడం కష్టంగా మారుతోంది.. రాత్రి వేళ రోడ్డు ప్రమా దాలు జరగడానికి నిద్ర మత్తే కారణమని అధికారులు తేల్చారు. దానిని అధిగమించడం ఎలా.. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్నట్టు.. ఈ సమస్యకు పరిష్కారం చూపారు. ఎలాగో తెలుసా..మీరే చదివేయండి మరి.. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు ప్రజలకు భద్రతపై మరింత భరోసా కల్పించే దిశగా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు వాహన తనిఖీలు చేస్తున్నాయి.. జాతీయ రహదారిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. డ్రైవర్లను ప్రశ్నించి, వారి పరిస్థితిని అంచనా వేసి ప్రయాణానికి అనుమతిస్తున్నారు. నిద్రలోకి జారుకుంటారని అనుమానం వస్తే వెంటనే వాహనాన్ని కొంతసేపు నిలిపివేసి డ్రైవరు రెస్ట్ తీసుకునే విధంగా చూస్తున్నారు. డ్రైవర్ల ముఖాన్ని నీటితో కడిగించి పంపిస్తున్నారు. దీని కోసం 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. డ్రైవర్లు ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించరాదని, నిద్ర వస్తుందనుకుంటే హైవేల పక్కన ఉంటే ఉచిత పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాన్ని నిలిపి విశ్రాంతి తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. - **రాజమహేంద్రవరం**

అన్నదాత సుఖీభవ రాని ఖాతాలపై నివేదిక ఇవ్వండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ జమకాని ఖాతాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు.జేసీ చిన్నరాముడు, వ్యవసాయ, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో సోమవారం ఉదయం సమీక్షించారు. కొంతమంది రైతుల ఖాతాల్లో నిధుల జమకాకపోవడంపై ఫెయిల్డ్ కేటగిరీలను స్పష్టంగా గుర్తించాలన్నారు. గ్రామ పంచాయతీ, రైతు సేవా కేంద్రాల వారీగా పరస్పర పొంతన లేని వివరాలను గుర్తించి వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఫెయిల్డ్ కేటగిరీల క్రింద గుర్తించబడిన వాటిలో ఆధార్ వివరాలు సరిలేకపోవడం, బ్యాంకు ఖాతాకు అనుసంధానం కానపోవడం, ఎన్‌పీసీఐ పేమెంట్ పెండింగ్, మరణించిన లబ్ధిదారులు, తాత్కాలిక భూయాజమాన్య ధ్రువీకరణ పత్రం, భూవివాదాలు, సర్వేకాని భూములు, జాయింట్ ఎల్‌పి లావాదేవీలు కారణాలుగా గుర్తించినట్టు తెలిపారు. ఈ లోపాలను తహశీల్దార్ స్థాయిలో గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మరణించిన లబ్ధిదారుల వారసులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలివిడతలో జమకాని రైతులకు రెండో విడత రెండూ కలిపి జమ చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఈడీ ఎంసీ సతీష్, రాజమహేంద్రవరం రూరల్,సెరవలి, గోకవరం, రాజానగరం తహశీల్దార్లు,ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 15న శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న నిర్వహించే వేడుకల్లో ప్రభుత్వ శకటాల ప్రదర్శన అత్యంత ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధిని చూపించాలన్నారు.

రియల్ చాన్స్!

మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్



- అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ
- కూటమి సర్కారు అవకాశం
- జూలై 26న నోటిఫికేషన్
- 90 రోజుల పాటు అమలు
- గతంలో 10,366 అప్లికేషన్లు
- 6,080 దరఖాస్తులకు ఓకే
- రియల్టర్ల ఆనందం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గతంలోను అవకాశమిచ్చినా ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది.అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా దానికి కొన్ని సవరణలు చేస్తూ గత నెల 26న దీనికి సంబంధించి జీవో విడుదల చేసింది. అందులో ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్టరయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీనికి అక్టోబరు 24వ తేదీ వరకు గడువు ఇచ్చింది. దరఖాస్తుదారులకు ప్రభుత్వం పలు రాయితీలను ప్రకటించింది.

గతంలో 10,366 మంది దరఖాస్తు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అక్రమ, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గతంలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.47.98 కోట్ల పాక్షిక అపరాధ రుసుం చెల్లించారు. వీటిలో 6,080 దరఖాస్తులు అప్రూవల్ అయ్యాయి. 990 దరఖాస్తులు తిరస్కరించారు. 1327 దరఖాస్తులకు షార్ట్ ఫాల్ నోటీసులు ఇచ్చారు. 379 దరఖాస్తుదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. 1580 దరఖాస్తులు ఇంకా పెం డింగ్‌లో ఉన్నాయి. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది.దీనికి కొన్ని సవరణలు చేసి 2025 జూన్ 30లోపు రిజిస్టర్ అయిన అనధికార లే అవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవోఎంఎస్ నెం.134ను 2025 జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90 రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే నేరంగా పరిగణిస్తారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అనధికార లే అవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వంటి వసతులు కల్పించరు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. అనధికార లే అవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్‌శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేస్తారు. దీంతో అమ్మకం, కొనుగోలు ఇతర లావాదేవీలు జరపడం యాజమానులకు సాధ్యం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అక్టోబరు 24 వరకు అవకాశం



అనధికార లే అవుట్లు,ప్లాట్ల యజమానులకు గుడ్ న్యూస్.. అక్టోబరు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవాలి.

రాహుల్ మీనా, జేసీ, వైస్ చైర్మన్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకినాడ

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా), రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా),అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో అర్హత కలిగిన అనధికార లేఅవుట్ల యజమానులు, అనధికార లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమ అనధికార లేఅవుట్ల, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్ https:// dtcp.ap.gov.in వెబ్‌సైట్‌లో నేరుగా సిటిజన్ లాగిన్ లేదా ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో లైసెన్సు పొందిన ఎల్టీపీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రాయితీలు..

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50శాతం రాయితీ పొందుతారు.సెప్టెంబరు 19వ తేదీలోపు ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 5 శాతం తగ్గింపును పొందుతారు. 4 వేల చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు ప్రభుత్వ రహదారి, ఇప్పటికే ఉన్న రహదారి సదుపాయం కలిగి అనధికార లేఅవుట్లలో భాగం కాకపోతే వాటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం కలుగుతుంది. రాయితీలు పొందొచ్చు.





ధర్నా చేసి.. సంతకాల సేకరణ

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తే వ్యతిరేకించాలని ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక పిలుపునిచ్చారు.పీవోడబ్ల్యు, ఐఎఫ్‌టీయుల సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వూరులో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఇందిరమ్మకాలనీలో నిరసన పదర్శన చేశారు.అదానీ స్మార్ట్ మీటర్లను బిగించరాదని, ట్రూఅప్ చార్జీ లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరిగే రాష్ట్రవ్యాప్త ధర్నాలో ప్రజలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మ కుమార్, ఆర్.హరీష్, శ్రీనివాస్, మున్నా, బాషా తదితరులు పాల్గొన్నారు.

12న నులిపురుగుల నివారణ దినం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. ఆ రోజున 1-19 ఏళ్ల పిల్లలకు ఉచిత ఆల్బెండజోల్ (డీ వార్మింగ్) మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మాత్రలు మింగేలా చూడాలని కోరారు. నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, శారీరక వృద్ధి సరిగా లేకపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయన్నారు.



నులిపురుగుల నివారణపై ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అంగన్‌వాడీల హాల్ సెల్!


తాళ్లపూడిలో..

పాత ఫోన్లు వద్దంటూ నిరసన ప్రదర్శన

- సక్రమంగా పనిచేయని ఫోన్లు
- తిరిగిచ్చేసిన అంగన్‌వాడీలు
- నెట్ వర్క్ అందక ఇక్కట్లు
- గంటల తరబడి ఫోన్లతో కుస్తీ
- యాప్‌ల భారం తగ్గించాలి
- జీతాలు పెంచాలని డిమాండ్
- కొత్త ఫోన్లు వెంటనే ఇవ్వాలి

కొవ్వూరు/తాళ్లపూడి/గోపాలపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేతకు గురిచేస్తున్నాయని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు,తాళ్లపూడి, గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద సోమవారం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సెల్‌ఫోన్లను సీడీపీవోలకు అప్పగించారు. కనీస వేతనాలు అందించే వరకు రికార్డు వర్క్ మాత్రమే చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వం 2022వ సంవత్సరంలో అందించిన సెల్‌ఫోన్లు 90 శాతం పాడైపోయి నెట్‌వర్క్ అందడంలేదని పేర్కొన్నారు. యాప్‌ల భారాన్ని మోయలేకపోతున్నామని సాంకేతిక సమస్యల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. మొబైల్‌లో పోషణ, ట్రాకర్, సంజీవిని, విల్క్, టీఎస్‌ఆర్ యాప్‌లు అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్ నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బంది అవుతుందన్నారు.గర్భిణుల విషయంలో నెలకు రెండు సార్లు టీఎస్‌ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండడం లేదని స్కానింగ్ చేసే సమయంలో సిగ్నల్ అందక, ఎక్కువ యాప్‌ల వల్ల ఫోన్ సరిగా పనిచేయడం లేదన్నారు.గర్భిణు లకు రోజువారీ పోషకాహారం అందించే సమయంలో వారి శారీరక మార్పుల కారణంగా వారి పాత ఫొటో స్కానింగ్ అవ్వడం లేదన్నారు. ఈ యాప్‌ల అదనపు భారానికి తోడు ఫించన్ల పంపిణీ సైతం తమకే కేటాయి స్తున్నారని వాపోయారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జూలై నెలాఖరుకు కొత్త ఫోన్లు ఇస్తామన్నారు. ఆగస్టు వచ్చినా ఇవ్వకపోవడంతో పాత ఫోన్లను సీడీపీవోకు అప్పగించామన్నారు. అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించకపోవడం అన్యాయమన్నారు.పనిచేయని సెల్‌ఫోన్లు మాకొద్దంటూ గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లపై పేర్లు రాసి సీడీపీవో మమ్మీకి అందజేశారు.


కొవ్వూరులో..


గోపాలపురంలో

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

జిల్లా కలెక్టరేట్‌లో 193 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రతి సోమవారం జరుగుతున్న పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వస్తున్న సమస్యలు గడువులోగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో 193 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఎస్‌డీసీ భాగ్యలక్ష్మి, సీపీవో ఎల్.అప్పల కొండ, డీఎల్‌డీవో ఏ శ్రీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 35 ఫిర్యాదులు


ఎస్పీకి సమస్యను విన్నవిస్తున్నరైతులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. వివిధ అంశాలకు సంబంధించి 35 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.


పోలీసులను పిలిచి ఆదేశాలిస్తున్న ఎంపీడీవో

మన్నించు..మహాత్మ


సీతానగరం,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మన్నించు మహాత్మ..నీకా ఈ సమస్య.. అంటూ అధికారులే ఆశ్చర్యపోయారు.మహాత్మ గాంధీ నడయాడిన చారిత్రాత్మక కస్తూర్బా గాంధీ ఆశ్రమానికి బెల్ట్‌షాపుల బెడద ఎక్కువైంది.ఈ మేరకు సీతానగరంలోని ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆశ్రమం సమీపంలో బెల్ట్‌షాపులు జోరుగా జరుగుతున్నాయని అక్కడ తాగిన మద్యం సీసాలు, గ్లాసులు ఆశ్రమంలో విసిరేస్తున్నారన్నారు.విచ్చలవిడిగా బెల్ట్‌షాపులున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.ఈ మేరకు ఎంపీడీవో భారతి సీతానగరం పోలీసులను సంప్రదించి ఆశ్రమానికి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

పైడిమెట్ట..సాగునీరెట్టా!

సాగు నీరందక రైతుల ఇక్కట్లు ట్రాన్‌ఫార్మర్ ఏర్పాటుకు డిమాండ్


కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న పథకం నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం స్టేజ్-1లో గత నెల 27న కాలిపోయిన 75 కె.వి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించాలని పథ కం చైర్మన్ ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్‌ను కోరారు.కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో రైతులు వినతిప త్రం అందజేశారు.పైడిమెట్ట ఎత్తిపోతల పథకం కింద మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, సూరయ్యపేట, ప్రక్కిలంక, కుక్కునూరు, వీరభద్రపురం, వేగేశ్వరపురం, తుపాకులగూడెం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక, వర్షాలు సరిగా పడకపోవడంతో సాగునీరందే దారి లేక వరిచేలు బీటలు వారుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణకు రూ.12.39 లక్షల నిధులు మంజూరు చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు.కలెక్టర్‌ను పథకం చైర్మన్ ముళ్ళపూడి రామచంద్రరావు, ఉపాధ్యక్షులు గన్నిన సత్తిబాబు, మం డా గోవిందు, వీరమళ్ళ బంగార్రాజు కలిశారు.



విద్యార్థులకు పాస్‌పోర్టు ఇస్తున్నారు. అయితే ఇది మన గుర్తింపును తెలియజేసే పాస్‌పోర్టు లాంటిది కాదు. అమ్మ పేరుతో మొక్కలు నాటినందుకు ఇచ్చే గ్రీన్‌పాస్‌పోర్టు. ఇందులో విద్యార్థులకు సంబంధించిన, నాటిన మొక్కల వివరాలు నమోదు చేయడంతో పాటు ఎదుగుదల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. విద్యార్థి ఫొటోతో ఉండే ఈ గ్రీన్ పాస్‌పోర్టు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



విద్యార్థులకు పాస్‌పోర్టు



(సిరాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా హాజరుకావడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మెగా పీటీఎం నిర్వహించిన రోజునే ఈ కార్యక్రమాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వారికి గ్రీన్ పాస్‌పోర్టులు అందించాలని నిర్ణయించారు. అమ్మ పేరుతో ఇప్పటికే మొక్కలు నాటిన విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారు. విద్యార్థి ఫొటో, వారు పెంచే మొక్కల వివరాలతో ఉన్న ఈ పాస్‌పోర్టు వారిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ పాస్‌పోర్టులు అందించిన తర్వాత మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది.

అమ్మ పేరుతో....

మెగా పీటీఎంలో అమ్మకు వందనం పేరుతో విద్యార్థులతో వారి తల్లులకు పాదాభివందనం చేయించిన ప్రభుత్వం ఇప్పుడు అమ్మ పేరుతో మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) పేరుతో వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎన్ని మొక్కలు అవసరమో ముందుగానే వివరాలు సేకరించి వారికి వాటిని అందించారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటికే 3.50 లక్షలకు పైగా మొక్కలను విద్యార్థులకు అందించి నాటించారు. పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో వీటి పెంపకం చేపట్టారు.

గ్రీన్ పాస్‌పోర్టు అంటే...

విద్యార్థి నాటిన మొక్క, ఆ విద్యార్థి వివరాలతో కూడినదే గ్రీన్ పాసుపోర్టు. దీనిని ఆకట్టుకునే విధంగా ఆకుపచ్చ రంగులో తీర్చిదిద్దారు. కవర్‌పై గ్రీన్ పాసుపోర్టు, అమ్మ పేరుతో మొక్క అని ఉంటుంది. మొదటి పేజీలో విద్యార్థి ఫొటో, పేరు, అపార్ ఐడీ, వయసు, పెన్ ఐడీ, పాఠశాల పేరు, చిరునామా ఉంటుంది. రెండో పేజీలో మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం, ఏ రోజున మొక్క నాటారు, ఎక్కడ నాటారు, ఆ ప్రదేశం వివరాలను నమోదు చేయాలి. ఇక్కడి నుంచి మొక్క పెరుగుదలలో విద్యార్థి బాగస్వామ్యం మొదలవుతుంది. ఎప్పటికప్పుడు మొక్క పెరుగుదలను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

మొక్క ఎదుగుదల ఆధారంగా గ్రీన్ పాయింట్లు

మొక్క ఎదుగుదలను బట్టి విద్యార్థులకు గ్రీన్ పాయింట్లు లభిస్తాయి. గ్రీన్ పాసుపోర్టులో మై జర్నీ విత్ మై ప్లాంట్స్ గ్రోత్ కింద ప్రతినెలా మొక్క ఎదుగుదల స్థితి, గ్రీన్ పాయింట్లు నమోదు చేసి క్లాస్ టీచర్ సంతకం తీసుకోవాలి. గరిష్ఠంగా మూడు మొక్కల వివరాల నమోదు కు అవకాశం కల్పించారు. చివరి పేజీలో విద్యా సంవత్సరంలో విద్యార్థి సాధించిన గ్రీన్ పాయింట్లు, అచీవ్ అయిన గ్రీన్‌లెవెల్‌ను నమోదు చేయాలి.

మొక్కల కోసం ఏమి చేయాలి

అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థుల వివరాలను ప్రతి పాఠశాలలో తీసుకుంటారు. వీరు కనిష్ఠంగా ఒకటి నుంచి మూడు రకాల వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఇలా ఎంపిక చేసుకోగానే పేరు, అపార్ ఐడీ వివరాలను ఉపాధ్యాయులు రిజిస్టర్ చేస్తారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అటవీ శాఖ సూచించిన నర్సరీ పాయింట్ల వద్దకు వెళ్లి విద్యార్థులు కోరుకున్న మొక్కలను పాఠశాలకు తీసుకువచ్చి వారికి ఎంఈవోలు, ఉపాధ్యాయులు అప్పగించాలి. ఇందుకు విద్యా శాఖ, సమగ్ర శిక్షా ద్వారా ప్రతి మొక్కకు రవాణా, ఇతర చార్జీలుగా రూ.7.85 మంజూరు చేశారు. ఈ విధంగా వచ్చిన తర్వాత విద్యార్థులు మొక్కలు నాటి సెల్ఫీ తీసుకోవాలి. ఈ ప్రక్రియను లీప్ యాప్ ద్వారా పూర్తి చేయాలి.



- పాఠశాలల్లో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం
- మొక్కలు నాటిన వారికి గ్రీన్ పాస్‌పోర్టు
- విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం
- ఇప్పటికే 3.50 లక్షల మొక్కలు అందజేత



మొక్క ఎదుగుదల, సాధించిన పాయింట్లు వివరాల నమోదు పట్టిక

విద్యార్థులు ఆసక్తిగా ముందుకొస్తున్నారు

పి.వేణుగోపాలరావు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)



అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు. వీరికి ఇచ్చే గ్రీన్ పాస్‌పోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ కోసం మొక్క నాటడాన్ని విద్యార్థులు బాధ్యతగా ఫీలవుతున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో గల 1,672 పాఠశాలల్లో విద్యార్థుల కోసం 1,90,788 మొక్కలను కేటాయించగా ఇప్పటిదాకా 1,20,917 మొక్కలను నాటారు. వీరి కోసం పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా 2.20 లక్షల గ్రీన్ పాసుపోర్టులను అందించాం. ఈ కార్యక్రమం నిరంతరాయం జరుగుతోంది. మొక్కల సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి పర్యావరణ పర్యవరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, అమ్మ ప్రాముఖ్యతను వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.



అంతర్వేదిలో సముద్రానికి 10 మీటర్ల దూరంలో సాగు చేస్తున్న నువ్వుల చేను

సముద్ర తీరం చెంత నువ్వుల సాగు

కొబ్బరి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న రైతు దేవదాసు



అంతర్వేది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో అంతర్వేదికి చెందిన రైతు కొల్లాబత్తుల దేవదాసు నువ్వుల పంట సాగు చేస్తున్నాడు. కొబ్బరి తోటలో అంతర పంటగా ఎకరం భూమిలో అర ఎకరం నువ్వు చేను సాగుకు కేటాయించాడు. వేసవికాలాన్ని సైతం లెక్క చేయకుండా సముద్ర ఇసుకలో సాగు ప్రారంభించి రెండు నెలలు అయ్యింది. మూడు నెలలకు పంట చేతికి వస్తుందని రైతు చెప్తున్నాడు. 50 కిలోల నువ్వుల వరకు పంట దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. కొబ్బరి మొక్కలు వేసి ఐదు సంవత్సరాలు అయ్యిందని, ప్రస్తుతం కాపు వచ్చిన ఈ తోటలో నువ్వు సాగు చేయాలనే ఆలోచన మొదలైందని చెప్పాడు. గతంలో వేరుశనగ వేయగా అధికదిగుబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం సరుగుడు తోటలకు డిమాండ్ లేదన్నారు. అర ఎకరంలో వేసిన నువ్వుల పంట చేతికి వచ్చిన తర్వాత మరింత ఎక్కువ సాగు చేస్తానని వివరిస్తున్నాడు. నువ్వులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ప్రస్తుతం అంతర్వేది ప్రాంతంలో నువ్వుల సాగులో దిగుబడి బాగుంటే మరింతమంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉందరు. వేసవిలో వేసిన ఈ నువ్వుల పంటకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరందించామన్నారు. చుట్టుపక్కల సముద్ర తీర ప్రాంతంలో ఉప్పు నీరు, ఉప్పు గాలి అధికంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత నేలలను సారవంతమైనవిగా మారిస్తే అన్ని పంటలూ పండించుకునేందుకు అనువుగా ఉంటాయన్నారు. జామ, మామిడి, జీడిమామిడి, కూరగాయల పంటలు పండించేందుకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఫెన్సింగ్ వేసి పశువులు, పక్షులు రాకుండా పంటను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. సముద్రపు నీరు రాకుండా జాగ్రత్తలు పాటిస్తే అంతర్వేది ప్రాంత భూములు మరింత సారవంతంగా మారి పంటలు పండించడానికి అనుకూలంగా ఉంటాయని రైతు దేవదాసు చెప్పాడు.

ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల



ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో తుమ్మల బాబు

పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ వేడుకలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) సోమవారం హాజరయ్యారు. విజయవాడలో జరిగిన ఈకార్యక్రమానికి సహకార శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీ చైర్మన్లు, అధికారులు హాజరయ్యారని బాబు తెలిపారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలందించడం, సహకార రంగంపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవడంతో పాటు స్థిరమైన సమగ్రతతో కూడిన వ్యవస్థను రూపొందించడం, రుణాల మంజూరు, తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించినట్టు బాబు పేర్కొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న గాయకుడు మనో



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మనో

కొత్తపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు మనో కుటుంబ సమేతంగా సోమవారం మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయార్చకులు ఆయనకు స్వాగతం పలికారు.ఆపై మనో కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన కుటుంబంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మనో తెలిపారు. అనంతరం ఆలయ ఈవో డి.సురేష్‌బాబు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అర్జున్-ప్రణీత్ ఎంపిక



కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అండర్-14 జాతీయస్థాయి పోటీలకు కడియం గ్రామానికి చెందిన దాసరి నాగవెంకట అర్జున్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.ప్రణీత్ ఎంపికైనట్టు కోచ్ నాగులకొండ వీరభద్రరావు తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఆంధ్రా, తెలంగాణ రీజనల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో అర్జున్-ప్రణీత్ జోడీ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో వీరి జోడి సెప్టెంబర్ 24, 25 తేదీల్లో తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సకల దోశ పరిహారార్థం తిరుమల తరహాలో ఏటా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులను అలంకరించి విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ, అకల్మస హోమం నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్య చక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం అంకుర్పారణ,నవమూర్తి ఆవాహన, పంచసయ్యాదివాసం తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.2,96,515 లభించింది.

నన్నయలో ఎంటర్‌ప్రెన్యూర్ అభివృద్ధి కేంద్రం!

ఉపకులపతి ప్రసన్నశ్రీ



నందగోపాల్‌ను సన్మానిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీకి హైదరాబాద్ నుంచి ఇండస్ట్రియల్ కన్సల్టెంట్ నందగోపాల్ సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు. ఈ వివరాలను వీసీ తెలుపుతూ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ నుంచి ఉపయోగకరమైన ప్రాజెక్టులు తీసుకొచ్చి వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు విద్యాసంబంధాలను పెంపొందించడంపై దృష్టిసారించాలన్నారు. డిజైన్ అభివృద్ధి మేధోసంపత్తి హక్కులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడం లక్ష్యంగా నన్నయ వర్శిటీని హోస్ట్ ఇనిస్టిట్యూట్‌గా ముందుకు తీసుకెళ్తామన్నారు. నందగోపాల్ మాట్లాడుతూ మంత్రిత్వ శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాజెక్టులు తీసుకొస్తానని, తద్వారా విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ కల్పన విభాగాధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కామర్స్, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- జేఎన్టీయూకేలో దీక్షారంభ్ కార్యక్రమం ప్రారంభం



జేఎన్టీయూకే, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్టీయూకేలోని ఎస్ఈకేలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షారంభ్ కార్యక్రమాన్ని ఈనెల 16 వరకూ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభం కాగా మొదటి రోజు ఇండక్షన్ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ విచ్చేసి మాట్లాడారు. భవిష్యత్‌లో ఏఐ టెక్నాలజీకి తగినట్లుగా ఉద్యోగవకాశాల కోసం, సివిల్ సర్వీసెస్ సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుని కృషిచేయాలని సూచించారు. అంతే కాకుండా యువత స్మార్ట్ ఫోన్, చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా గ్రంథాలయం, క్రీడా వసతులను వినియోగించుకుని భవిష్యత్‌లో యూనివర్శిటీకి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, సమన్వయకర్తలు జయప్రసాద్, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎస్.సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణ మాణిక్యాంబ

అమ్మవారికి స్వర్ణపూత కవచం అందజేసిన మాజీ మంత్రి వేణు కుటుంబం



స్వర్ణకవచాలంకృత మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయం లో ద్వాదశ శక్తిపీఠంగా పూజలు అందుకుంటున్న మాణిక్యాంబ అమ్మవారికి సోమవారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు స్వర్ణపూత కవచం(చీర) సమర్పించారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న వేణు దంపతులు, కుమారుడు నరేన్ దంపతులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేణు దంపతులు అమ్మవారికి స్వర్ణపూతకవచం సమర్పించగా అర్చకులు సంప్రోక్షణ పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. దర్శన అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు యల్లమల్లి సతీష్‌కుమార్, అంబటి తుకారాం, పెమ్మిరెడ్డి దొరబాబు, కట్టా గోవిందు, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వాసంశెట్టి శ్యామ్, కోటిపల్లి అబ్బు, భజన భక్త సమాజం సభ్యుడు బోనం శ్రీను పాల్గొన్నారు.

బతుకు బండి.. ఇలాగైతే ఎలాగండీ!?

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో తన తోపుడు బండిని అతి కష్టంపై ఆటోకు కట్టుకొని తీసుకెళుతున్న ఆ మహిళ చిరు వ్యాపారి. ఏవీఏ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తోంది. ఆమెకు దివ్యాంగుడైన ఒక కుమారుడు ఉన్నాడు. ఆమెకిదే బతుకుబండి.. ఇదిలా ఉండగా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండిని నగరపాలక సంస్థ సిబ్బంది లాక్కెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చిన ఆమె, బండి లేకపోవడంతో లబోదిబోమంది. స్థానికులు చెప్పడంతో నగరపాలక సంస్థ కార్యాలయానికి పరుగు పెట్టింది. రూ.500 జరిమానా చెల్లిస్తేనే బండిని ఇస్తామని మునిసిపల్ సిబ్బంది సెలవిచ్చారు. అయితే ఆమె వద్ద రూ.500 లేకపోవడంతో అప్పు చేసి ఆ సొమ్ములు చెల్లించింది. ఆ బండిని ఆటోకు కట్టి లాక్కెళుతుండగా బతుకు బండి ముక్కలైపోయింది. ఇది చూసిన స్థానికులు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా చిరు వ్యాపారులపై ఈ జరిమానాలేంటని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సిబ్బంది తీరుపై మండిపడ్డారు.



ఆంధ్ర పాలిటెక్నిక్‌లో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

ప్రిన్సిపాల్ జనార్దనరావు

కాకినాడ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్దనరావు తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కాండ్రకోట నూకాలమ్మకు వెండి ఆభరణాల బహూకరణ



పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్ర కోట నూకాలమ్మకు విశాఖపట్నానికి చెందిన బండారు శ్రీనివాస సత్యేంద్ర-పద్మజ దంపతులు వెండి కవచం, ఆయుధ సహిత హస్తాలు, సూర్య చంద్రులను బహూకరించినట్టు ఈవో ఎం.రాంబాబురెడ్డి సోమవారం తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

ప్రయత్నం ఫలించే.. ప్రాణం నిలిచే!

ఆంబోతును సెప్టిక్‌ట్యాంకు నుంచి బయటకు తీసిన ఫైర్ సిబ్బంది

అంబాజీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్‌ట్యాంకులో పడిపోయిన ఆంబోతు కోసం ఫైర్‌సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించి బయటకు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని అల్లాడస్వామినాయుడుకాలనీలో తొత్తరమూడి వెంకటర మణ ఇంటి ఆవరణలో 15అడుగుల లోతులో వరలతో సెప్టిక్‌ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. సోమవారం సెప్టిక్‌ట్యాంకులో ఆబోంతు పడిపోయింది. దీంతో స్థానికులు అమలాపురం ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో 15 అడుగుల లోతులో పడిపోయిన ఆంబోతును 2 గంటలు శ్రమించి బయటకు తీశారు. అనంతరం ఆంబోతుకు ప్రాథమిక చికిత్స అందించారు.


సెప్టిక్ ట్యాంకులో పడిపోయిన ఆంబోతు


బయటకు వచ్చిన ఆంబోతు


బయటకు తీసేందుకు శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆంబోతుకు అంత్యక్రియలు


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంబోతుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం- కొత్తపేట ప్రధాన రహదారిలో సోమవారం గొలకోటివారిపాలెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఆంబోతు మృతిచెందింది. విషయం తెలుసుకున్న మోడేకుర్రు సర్పంచ్ కు దుపూడి రామలక్ష్మీవెంకటేశ్వరరావు అక్కడికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పదరా.. పదరా.. పదరా..

- ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన యువత
- కాకినాడలో సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన ర్యాలీ
- కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు

యువతరం తరలివచ్చింది. ఆర్మీ కొలువు కోసం కదిలివచ్చింది. భుజాన బరువైన బ్యాగులతో కాకినాడలో అడుగుపెట్టింది. దీంతో కాకినాడ జిల్లా క్రీడామైదానం మరోసారి కిటకిటలాడింది.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చిన అభ్యర్థులు

కాకినాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని జిల్లా క్రీడామైదానంలో సోమవారం అర్ధరాత్రి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభమైంది. ఇప్పటికే తొలిదశలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్యాండెట్ అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన పదివేలమంది యువత రెండో దశ ఎంపిక కోసం కాకినాడ జిల్లాకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో మొత్తం 12 జిల్లాలతోపాటు యానాం అభ్యర్థులు కూడా పాల్గొననున్నారు. తేదీల వారీగా ఆయా జిల్లాల వారికి ఈవెంట్లు జరగనున్నాయి. ఆగస్టు 5వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు శారీరక దారుఢ్యపరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా జిల్లాల అభ్యర్థులు సోమవారం రాత్రి పదిగంటలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనకాపల్లి, యానాం, పార్వతీపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ జిల్లాల అభ్యర్థులకు తర్వాత తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా తరలివచ్చిన అభ్యర్థులకు జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

రాత్రి ఒంటి గంటన్నర నుంచి..

తొలుత కాకినాడ జిల్లా క్రీడామైదానం ప్రధాన గేటు వద్ద నుంచి అడ్మిన్‌కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. తర్వాత కుడిపక్కన ఏర్పాటు చేసిన టెంట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దూరప్రాంతాలనుంచి వచ్చే విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు గుడారాలను ఏర్పాటు చేశారు. భోజనం, వసతి కల్పించారు. రాత్రి ఒంటి గంటన్నర దాటిన తర్వాత నుంచి 1.6 కేఎం పరుగు, ఇది 6.15 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో ఎంపికైన వారు ఎత్తు, బరువు, ఛాతీ, లాంగ్ జంప్, జిగ్‌జాగ్, బ్యాలెన్స్, పుష్ అప్స్, వంటి ఫిజికల్ ఫిటెనస్ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ టెస్టులు, తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటాయి.

ఆటో బోల్తా .. ఏడుగురు విద్యార్థులకు గాయాలు

హంసవరం ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా ఢీకొన్న కారు
తుని ఏరియా ఆసుపత్రికి తరలింపు


బోల్తా కొట్టిన ఆటో


తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బోల్తా కొట్టింది. దీంతో ఏడుగురికి గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే తుని మండలం మరువాడ గ్రామం నుంచి విద్యార్థులు ఆటో ఎక్కి హంసవరంలో గల ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు గాయాలు కాగా ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యార్థులు చెల్లాచెదురుగా పడిపోవడంతో తల, కాళ్లకు గాయాలయ్యాయి. కేకలు వేయడంతో ఆ ప్రాంతంలోని రైతులు, పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన చేరుకుని విద్యార్థులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన విద్యార్థులు అప్పన రవణ్‌కుమార్, కామిరెడ్డి కృపానంద, కామిరెడ్డి సాత్విక్, కిల్లాడి నవీన్ రాజు, రామ్‌చరణ్, ఉరుకోటి రవి, ఉరుకోటి పవన్, జి.ఈశ్వరికి వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఆటోను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా కారును పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఏరియా ఆసుపత్రికి పరుగులు తీశారు. గాయాలతో ఉన్న తమ పిల్లలను చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఘటనపై తుని ఎమ్మెల్యే దివ్య ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకా రం.. కాకినాడ జిల్లా తుని తాండవ బ్రిడ్జిపై నా గరాజుపేట రైల్వే గేటు వైపు నుంచి తుని రైల్వేస్టేషన్ వైపు బ్రిడ్జిపై వ్యక్తి నడుచుకుని వస్తుండగా రైలు ఢీకొనడంతో మరణించాడు. మృతదేహంపై నలుపురంగు జీను ప్యాంట్, చింతపిక్క రంగు కట్‌డ్రాయరు ఉన్నాయన్నారు. ఎడమకన్నుకు అంధత్వం ఉందన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కాకినాడ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల ఉండే మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ కెవివి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బంధువులు గుర్తించేందుకు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే 08842379052, 9440796542లో సంప్రదించాలని సీఐ సత్యనారాయణ కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన దానయ్య

పెరవలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో పల్లా దానయ్య (42) గ్రామంలో ఇళ్ల వద్ద విద్యుత్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో కేబుల్ వైర్లు కట్టేందుకు పిలవడంతో వెళ్లాడు. విద్యుత్ స్తంభంపైకి కేబుల్ వైర్లు కట్టడానికి ఎక్కగా షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య ధనలక్ష్మీతో పాటు చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతిపై కేసు


మృతిచెందిన వ్యక్తి

రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి నట్టు రాయవరం ఎస్ఐ డి. సురేష్ బాబు సోమవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని పసలపూడి చైతన్య రైస్‌మిల్లు సమీపంలో సుమారు 70 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 సహాయంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440904843కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

అన్నీ ఏకపక్షమే..

కాకినాడలో నాల్గో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు




మ్యాచ్ ఆడుతున్న ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ జట్ల సభ్యులు


క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఓ కోచ్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతోన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్‌లో భాగంగా సోమవారం నాల్గోరోజు మ్యాచ్‌లన్నీ ఏకపక్షంగానే జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ అపోలో ఆసుపత్రి ప్రతినిధులు మ్యాచ్‌లను ప్రారంభించారు. కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో 6 మ్యాచ్‌లు జరిగాయి. దాద్రానగర్ హవేలి- జమ్మూ కాశ్మీర్ జట్ల మధ్య మ్యాచ్‌లో దాద్రానగర్ హవేలీ 6-0తో విజయం సాధించింది. గుజరాత్, రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచ్‌లో గుజరాత్ 3-2తో విజయం సాధించింది. మిజోరాం, తెలంగాణ మధ్య మ్యాచ్‌లో మిజోరం 15-0 తో విజయం సాధించింది. మణిపూర్, పుదుచ్చేరి మధ్య మ్యాచ్‌లో మణిపూర్ 9-1తో.. అస్సాం, కేరళ మ్యాచ్‌లో అస్సాం 5-1తో.. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ 7-1 తేడాతో విజయం సాధించాయి. మ్యాచ్‌లను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, హాకీ ఆంధ్ర సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు పర్యవేక్షించారు.

తల్లి, ఇద్దరు కుమార్తెల హత్య కేసు..
పోలీసుల అదుపులో నిందితుడు!

సామర్లకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సీతారామ దళిత కాలనీలోని ఓ ఇంటిలో తల్లి,ఇద్దరు కుమార్తెలను దారుణంగా హతమార్చిన వ్యక్తిని సామర్లకోట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శనివారం అర్ధరాత్రి ఈ హత్యోదంతం అనంతరం సామర్లకోట నుంచి సదరు అనుమానితుడు పొరుగు జిల్లాకు వెళ్లిపోగా సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు వెళ్లి మాటు వేసి పట్టుకున్నట్టు సమాచారం. ఈ హత్యలకు సామర్లకోటకు చెందిన తలే సురేష్ పాల్పడినట్టు పోలీసుల వద్ద పక్కా సమాచారం లభించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అయితే ఈ హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్థానిక కోట్లమ్మచెర్వు ప్రాంతానికి చెందిన సురేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడని, మృతురాలి ఇంటికి గత కొంత కాలంగా రాకపోకలు సాగిస్తున్నట్టు సమాచారం పోలీసులకు లభించినట్టు తెలిసింది.

పోస్టుమార్టంలో విస్తుపోయే అంశాలు

హత్యకు గురైన తల్లి,కుమార్తెల మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన వైద్యులు విస్తుపోయినట్టు విశ్వసనీయ సమాచారం. మాధురి తలభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యేలా కొట్టినట్టు, పెద్దకుమార్తె అయిన పుష్పకుమారిని తల పైభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యిందని తెలుస్తోంది. చిన్న కుమార్తె జెస్సీని తలపై కొట్టడంతో బాటు గొంతు, గుండెలపై తొక్కడంతో రిబ్స్ ఎముకలు విరిగిపోయినట్టు పోస్టుమార్టం సమయంలో వైద్యులు గుర్తించినట్టు సమాచారం.

పుట్టినరోజు వేడుకలకు వెళ్తూ...

లారీ ఢీకొని యువకుడి మృతి


సాయినవీన్ (ఫైల్)

దేవరపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెదనాన్న మనవడి పుట్టిన రోజు వేడుకకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటనగర్‌కు చెందిన చెలమశెట్టి మహావీర సాయినవీన్ (25) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలోని శ్రీ లక్ష్మితులసి ఆగ్రో పేపర్ మిల్లులో డీసీఎస్ ఆపరేషన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరంలో పెదనాన్న మనవడి పుట్టినరోజు వేడుకకు అశ్వారావుపేట నుంచి సోమవారం ఉదయం 11గంటలకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో గౌరీపట్నంలో జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తల్లిదండ్రులు ఆరేళ్లక్రితం మృతిచెందారు. తమ్ముడు శివశంకర్ రాజమహేంద్రవరంలో డెకరేషన్ వర్క్ చేస్తున్నాడు. సాయినవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా శుభం నొఖ్వాల్


కొత్త సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్

రంపచోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం రెవెన్యూ సబ్ డివిజన్‌కు కొత్త సబ్‌కలెక్టర్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన శుభం నొఖ్వాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా ఉన్న కల్పశ్రీ స్థానంలో ఈయన్ను నియమించారు. శుభం నొఖ్వాల్ రాజస్థాన్‌లోని గంగానగర్ ప్రాంతంలోని ఓ పల్లెటూరు నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఢిల్లీ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న హన్సరాజ్ కళాశాలలో ఫిలాసఫీలో బ్యాచిలర్ డిగ్రీ చేసి సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఈయన తండ్రి ఇంద్రజిత్ నొఖ్వాల్ రైల్వేలో సీటీఐగా పనిచేస్తుండగా, తల్లి శకుంతలావర్మ ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. శుభం నొఖ్వాల్ సోదరి స్వాతి నొఖ్వాల్ కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా, ఈయన బావ కులదీప్ కూడా ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈయన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికై అసిస్టెంట్ కలెక్టర్‌గా ఎన్టీఆర్ జిల్లాలో పనిచేశారు. అనంతరం ఈయనను రంప చోడవరానికి సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇదిలాఉండగా రంపచోడవరం ప్రస్తుత సబ్ కలెక్టర్ కల్పశ్రీకి పదోన్నతిపై అల్లూరి జిల్లాలోనే ఏదో ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగానో లేక రాజమండ్రి, కాకినాడ జిల్లాల్లో ఏదో ఒకచోట ముఖ్య పోస్టులలో నియమిస్తారన్న ప్రచారం సాగుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు పి.గన్నవరం విద్యార్థి


సందీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎమ్ ఉమాదేవి

పి.గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు లాంగ్‌జంప్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కలిగితి సందీప్ ఎంపికైనట్టు హెచ్‌ఎం కె.ఉమాదేవి తెలిపారు. ఈనెల3న రామచంద్రపురం ఎస్‌కేవీఎన్ కళాశాలలో జరిగిన పోటీల్లో అండర్-16 లాంగ్ జంప్‌లో సందీప్ మొదటిస్థానం, 60మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం సాధించినట్టు చెప్పారు. సందీప్ ఈనెల 9,10,11న బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.భీమేంద్ర అభినందించారు.

పేకాటలో పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగి

విచారణాధికారిగా డీసీ

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగిపై విచారణకు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావును విచారణాధికారిగా నియమిస్తూ ఈవో సుబ్బారావు ఆదేశాలిచ్చారు. ఆయన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. ఇదిలాఉండగా సదరు ఉద్యోగి సోమవారం ఈవోను కలసి విజ్ఞాపన అందజేశారు.

స్వదేశానికి రప్పించండి

కువైట్‌లో అవస్థలు పడుతున్న ర్యాలి మహిళ


ఆవేదన వ్యక్తం చేస్తున్న ర్యాలికి చెందిన గుమ్మడి లక్ష్మి

ఆత్రేయపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మి ఉపాధి నిమిత్తం మూడున్నర ఏళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లింది. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో అక్కడయ జమానులు దొంగతనం నేరం మోపి కేసు పెడతానంటూ బెదిరిస్తూ తనను రాకుండా అడ్డుకుంటున్నారని ఆ మహిళ కన్నీటి పర్యాంతం చెందుతూ ఓ వీడియో పోస్టు చేసి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'నేను కువైట్‌లో చాలా కష్టాల్లో ఉన్నాను. నన్ను ఎలాగైనా మా గ్రామానికి రప్పించండి' అంటూ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఎన్‌ఆర్‌ఐలు సంబంధిత అధికారులను వేడుకుంటుంది. నన్ను స్వదేశానికి రప్పించాలని ఆమె ప్రాథేయపడుతుంది.

వనదుర్గ ఆలయంలో
శ్రావణ మాసోత్సవాలు

తొలిరోజు బాలాత్రిపురసుందరి అలంకారం


వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న ఈవో వీర్ల సుబ్బారావు, కుటుంబసభ్యులు


బాలాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న వనదుర్గ అమ్మవారు

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శ్రావణ మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించగా ఈవో, చైర్మన్ పండితులకు దీక్షావస్త్రాలను అందజేశారు. తొలిసారిగా అమ్మవారికి దేవస్థానం తరుపున సారెను సమర్పించారు. ఆషాఢమాసంలో సమర్పించాలని ముందుగా అనుకున్నా వైదికకమిటీ సూచనలతో శ్రావణమాసంలో అమ్మవారి ఉత్సవాల సమయంలో అందించాలని పేర్కొనడంతో ఈవో కుటుంబసభ్యులు, దేవస్థానం ఆలయ విభాగ అధికారులు, పండితులతో మేళతాలాల నడుమ సారె, చీరలు, గాజులు, ఇతర తీపి పదార్థాలను అందజేశారు. తొలిరోజున అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. పౌర్ణమి వరకు ఈ జాతర ఉత్సవాలు జరగనుండగా రోజుకొక అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ప్రత్యేక పూజల్లో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- నిందితుడు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల వాసి
- ద్విచక్రవాహనం, 44.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం ఎస్సీ పేట గ్రామానికి చెందిన గొర్రెల చిన్నబాబు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో 4.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి, ఆర్టీసీ కాలనీలో 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్టు తెలిపారు. మే 31న డోర్నకల్‌లో బైక్ చోరీ జరిగినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును విచారిస్తున్న క్రమంలో సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్టు తెలిపారు. విచారించగా అతడు చేసిన 6 దొంగతనాలను ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆభరణాల విలువ రూ.1,00,000 ఉంటుందన్నారు. దొంగను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందిచారు.

జంక్షన్లు జామ్



లాలాచెరువు ప్రాంతంలో ట్రాఫిక్‌జామ్

నగరంలో రాకపోకలకు రోజూ పాట్లే

- వైసీపీ హయాంలో ఆర్భాటపు పనులు
- రాజమహేంద్రికి అనవసర 'షో'కులు
- కుచించుకుపోయిన కూడళ్లు
- వాహనదారుల అవస్థలు
- సరిదిద్దడంలో పాలకుల తాత్సారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చారిత్రక రాజమహేంద్రవరంలోని ప్రజలను ట్రాఫిక్ తిప్పలు పెడుతోంది. జిల్లా కేంద్రంలోని కుచించుకుపోయిన కూడళ్లు వాహనాల రాకపోకలను ఇరుకున పెడుతున్నాయి. అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటాలు చేస్తే సదుపాయాలు మెరుగున పడతాయని జనం అనుకొన్నారు. తీరా పనులు కాస్తా పూర్తయ్యాక 'షో'కులతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఎక్కడైనా అభివృద్ధి చేస్తే ప్రస్తుత పరిస్థితిలో మార్పు రావాలి. కానీ సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ప్రయాణానికి మాత్రం యాతన పెరిగిపోయింది.

నగరంలో ఇదో వింత

రాజమహేంద్రవరం నగరం వాణిజ్య, వైద్య, విద్య, రవాణాపరంగా ఇటు కోనసీమ, అటు ఏజెన్సీ, కాకినాడ ప్రాంతాలకు రాజధానిగా చెప్పవచ్చు. కొన్నేళ్లుగా ఆవాసాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అంతే స్పీడుతో కొత్త వాహనాలు రోడ్డుపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్లు, కూడళ్లను అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఆ ప్లాను, ఈ ప్లాను అంటూ ఎవరికి ఇష్టం వచ్చిన ట్లు వాళ్లు ఒక సహేతుక, శాస్త్రీయ పద్ధతులు లేకుండా కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని అభివృద్ధి పేరుతో నగరంలో పోశారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ తతంగం యథేచ్ఛగా సాగింది. ఆ ముసుగులో అధిక మొత్తాలను అప్పటి వైసీపీ తెరచాటు కాంట్రాక్టర్లు, ఆనాటి ప్రజాప్రతినిధులు మింగేశారు. అవసరమైన అభివృద్ధిని మరుగున పడేసి అనవసరపు 'షో'కులను నగరానికి అద్దారు. ప్రధానంగా రాజమహేంద్రవరంలోని కూడళ్లు ట్రాఫిక్ చోకింగ్ పాయింట్లుగా మారిపోయాయి. ముఖ్య కూడళ్లలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నగరంలోకి అటు కోటిపల్లి బస్టాండ్, ఇటు లాలాచెరువు, క్వారీ మార్కెట్ సెంటర్ లేదా హైవే నుంచి ప్రవేశించినా నగరంలోకి వచ్చే సరికి ట్రాఫిక్ ముప్పుతిప్పలు పెడుతోంది. కోటిపల్లి బస్టాండ్, శ్యామలా సెంటర్, తాడితోట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, వెంకటేశ్వరా మార్కెట్ జంక్షన్, ఐఎల్‌టీడీ జంక్షన్, బైపాస్ రోడ్డు కూడళ్లలో రద్దీ సమయాల్లో వాహనదారులకు యాతన తప్పడం లేదు.పుష్కరఘాట్, దేవీచౌక్ సెంటర్లలోనూ అదే పరిస్థితి. జాంపేట, దేవీచౌక్ సమీపంలోని గాంధీ విగ్రహం, ఇన్‌కంట్యాక్స్ కార్యాలయం కూడలిలో వాహనాలను నడపడం డ్రైవర్లకు పరీక్షగా మారింది. ఆర్టీసీ డ్రైవర్ల ఇబ్బంది అంతా ఇంతా కాదు. లాలాచెరువు, క్వారీ మార్కెట్‌కి వెళ్లే సెంటర్, కంబాల చెరువు పార్కు ఏరియాల్లో ప్రమాదాలు కోరలు చాచుకున్నాయి. విగ్రహాలను చూస్తూ మురిసిపోవాలో, అనాలోచిత నిర్ణయాలను తిట్టుకోవాలో జనాలకు అర్థం కాని పరిస్థితి. దీనికితోడు సరైన పార్కింగ్ ఏర్పా ట్లు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఎక్కడ పడితే అక్కడ నిలిపేయడం తప్పడం లేదు.

పుష్కరాలకు పాట్లే

ఎంత ఓర్పుతో వాహనం నడిపే వారికైనా విసుగు, వాహనాలకు గీతలు తప్పడం లేదు. సాయంత్రం.. ఉదయం వేళల్లో జంక్షన్లు జామ్ అవుతున్నాయి.హారన్ల మోత మోగుతోంది. ఇదంతా ఏడాదిగా చూస్తున్న ప్రస్తుత పాలకులు సరిదిద్దే పనికి ఇంకా అడుగు వేయకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత పుష్కరాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నగరంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సీఎం చంద్రబాబు స్వయంగా పనులను పర్యవేక్షించారు.ఆ సమయంలో రోడ్లను వెడల్పు చేశారు. దీంతో రోజుకు సుమారు 5లక్షల మంది యాత్రికులు వచ్చినా పెద్దగా ఇబ్బంది కలగలేదు. మళ్లీ పుష్కరాలు 2027లో నిర్వహించనున్నారు. ఈసారి రోజుకు 10 లక్షలకుపైగా జనమొచ్చే అవకాశం ఉందనే అంచనాలు న్నాయి. వాహనాలు కూడా భారీ సంఖ్యలోనే నగరంలో రాకపోకలు సాగిస్తాయి. అయితే ఇప్పటి పరిస్థితిలో మార్పు రాకుంటే.. ముఖ్యంగా కూడళ్లను వెడల్పు చేయకపోతే నరకం తప్పకపోవచ్చు. పుష్కరాలకు దగ్గరలో నిధులు రాబట్టి హడావుడి పనులతో సరిపెట్టకుండా.. కాస్త ముందుగానే ప్రభుత్వం నుంచి సొమ్ములు తెచ్చుకొని శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టాలని పాలకులకు నగర పౌరులు సూచిస్తున్నారు. లాలాచెరువు జంక్షన్, పుష్కరఘాట్, దేవీచౌక్, ఇన్‌కంట్యాక్స్ కార్యాలయ ప్రాంతం, కంబాల చెరువు పార్కు తదితర ప్రాంతాలపై దృష్టి సారించాల్సి ఉంది.



రాజమహేంద్రవరంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ స్తంభించిన దృశ్యాలు

సీవీ మార్కెట్ తరలింపు సమస్యకు పరిష్కారం

జీవో జారీ చేసిన ప్రభుత్వం: ఎమ్మెల్యే వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరం మధ్యలో ఉన్న సెంట్రల్ విజిటబుల్ మార్కెట్ తరలింపు సమస్యకు కూటమి ప్రభుత్వ చొరవతో పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. సోమవారం ఉదయం సీవీ మార్కెట్ వద్ద ఇయ్యపు కూర్మారావు నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీవీ మార్కెట్‌ను రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు శివాలయం రోడ్డులో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి/శ్రీసీతారామస్వామి ఆలయానికి చెందిన నాలుగు ఎకరాల భూమిలో ఈ మార్కెట్ శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. ఇది కేవలం స్థల మార్పు కాదని ప్రజల శ్రేయస్సు కోసం చేసిన సాహసోపేత నిర్ణయమన్నారు. రివర్‌ఫ్రంట్, అఖండ గోదావరి ప్రాజెక్టుల మాదిరి ఇది కూడా చారిత్రాత్మక ముందడుగు అని అన్నారు. బొమ్మూరులో మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన వ్యాపారులు అక్కడ విద్యుత్, రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారని, అందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. కార్యక్రమంలో మజ్జి రాంబాబు, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్,వర్రే శ్రీనివాస్, వై.శ్రీను, దొండపాటి సత్యంబాబు, తవ్వా రాజా, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, కంటిపూడి శ్రీనివాస్, కడలి రామకృష్ణ, రుంకాని విజయ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దివాన్‌చెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. దివాన్‌చెరువులో మాజీ ఎంపీటీసీ గంగి బ్రహ్మరాజుకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1,26,392 సొమ్ము మేరకు చెక్కును సోమవారం ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబాలను, అనారోగ్యం బారిన పడిన వారిని, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు పెద్దకొడుకుగా అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వంకా మల్లిబాబు, మల్లారపు సత్యానందం, కందుల బాబూరాయుడు, నీలపాల పండు, దాసరి శ్రీనివాసరావు, పెద్ద, పాల్గొన్నారు.

ప్రయాణికులకు తాగునీరు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోకవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గోకవరం ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల కోసం అధికారులు తాగునీరు ఏర్పాటు చేశారు. 'ప్రయాణికుల దాహార్తి' శీర్షికతో ఈ నెల 4న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ మార్గరేట్ స్పందించారు. ఎంక్వైరీ పాయింట్ వద్ద స్టీల్ డ్రమ్ముతో తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు గమనించి దాహార్తి తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.



నీటి తీరువా బకాయిలు వసూలు చేయండి

బిక్కవోలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న నీటితీరువా బకాయిలను వసూలు చేయాలని తహశీల్దార్ సత్యకృష్ణ వీఆర్వోలకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సర్వే నెంబర్ల ద్వారా వున్న రైతుల నీటితీరువా డిమాండ్ రూ.54,16,248 ఉండగా రూ.29,41,979 వసూళ్లయ్యిందని ఇంకా రూ.24,74,269 బకాయి ఉందన్నారు. అలాగే ఎల్‌పీఎం (ల్యాండ్ పార్షియల్ నెంబర్) ద్వారా రూ.52,20,597 డిమాండ్ ఉండగా రూ.26,80,109 వసూళ్లయ్యిందని ఇంకా రూ.25,40,488 బకాయి ఉందన్నారు. రైతులంతా తమ బకాయిలను ఆన్‌లైన్, ఫోన్‌పే ద్వారా లేక సచివాలయంలో తమ వీఆర్వోలకు నేరుగా చెల్లించవచ్చునన్నారు. ప్రస్తుతం 1434 పసలీకి సంబంధించిన నీటితీరువా బకాయిలకు, 1935 పసలీ ప్రారంభమైతే బకాయిలకు వడ్డీలు పడతాయని రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు.

రైట్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా

దివాన్‌చెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం భూపాలపట్నంలోని రాజమహేంద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (రైట్) కళాశాలకు యూజీసీ ప్రతిష్టాత్మకమైన స్వయం ప్రతిపత్తి హోదాను కల్పించింది. ఈ విషయాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి సోమవారం తెలిపారు. దీంతో రైట్‌కు ఈ స్వయం ప్రతిపత్తి హోదాను ఆమోదిస్తూ జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్ కృష్ణప్రసాద్ సంబంధిత ఉత్తర్వులను కరస్పాండెంట్ శ్రీహరి, ప్రిన్సిపాల్ భాస్కరముత్యాలుకు అందజేశారు. తమ కళాశాల ఈ హోదాను సాధించడంలో భాగమైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పూర్వవిద్యార్థులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది

ఇండిపెండెన్స్ డే కప్ చెస్ పోటీల విజేత రాఘవ



ట్రోఫీ, నగదు బహుమతులతో చదరంగ పోటీల విజేతలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఆలిండియా ఇండిపెండెన్స్ డే చదరంగం పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన రాఘవ శ్రీవాత్సవ్ విజేతగా నిలిచారు. కాకినాడకు చెందిన జ్ఞాన సాయి సంతోష్ రన్నరప్‌గాను, దివ్యతేజ మూడో స్థానం సాధించారు. లారెల్ హై గ్లోబల్ స్కూల్‌లో కాల్‌ఫ్యూజన్ చెస్ అకాడమీ సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. మొత్తం ఏడు రౌండ్ల పోటీలను స్విస్ పద్ధతిలో నిర్వహించగా 7/7 పాయింట్లతో రాఘవ శ్రీవాత్సవ్ ఛాంపియన్‌షిప్‌తోపాటు రూ.25 వేల నగదు బహుమతి గెల్చుకున్నారని, విజేతలందరికీ మొత్తంగా రూ.1,23,456 నగదు బహుమతి, 25 ట్రోఫీలు అందజేశామని టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల హైమావతి తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, లారెల్ గ్లోబల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏక్తా, గౌరీ సిల్క్స్ శ్రీవిద్య, టోర్నమెంట్ కన్వీనర్ పూర్ణచంద్రశర్మ, విత్తనాల కుమార్, ఏఆర్ఎస్ సాఫ్టెక్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కొండగుంటూరు వైసీపీ ఎంపీటీసీ



వైసీపీ ఎంపీటీసీని జనసేనలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కొండగుంటూరు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు పెమ్మనబోయిన నాగ వరలక్ష్మీ దేవి, పెమ్మనబోయిన శివరామ్ తమ అనుచరగణంతో జనసేన పార్టీలో చేరారు. వారికి రాజానగరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధి, ఆశయ సాధన, ఆలోచనలకు ఆకర్షితులై వైసీపీని వీడి జనసేనలో చేరినట్టు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసైనికులు ఉన్నారు.

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా రవిశంకర్



సూపరింటెండెంట్‌ను కలిసిన రవిశంకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బీజేపీ నాయకుడు పాతూరి చిరంజీవి రవిశంకర్‌ను నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆమోదంతో సూపరింటెండెంట్ రవిశంకర్‌ను అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమించారు. రవిశంకర్ బీజేపీ జిల్లా కమిటీలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో బీజేపీ నుంచి ఉమాదేవి సభ్యురాలిగా కొనసాగుతుండగా, ఇప్పుడు మరొకరికి అవకాశం కల్పించడం గమనార్హం.

తల్లిపాల వారోత్సవాలు

అనపర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల విశిష్టతపై ప్రతి గర్భిణీకి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు సత్తి దేవదానరెడ్డి అన్నారు. సోమవారం పొలమూరులో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాశన నిర్వహించారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి గర్భిణులకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ నూరుశాతం జరగాలి

నగరంలో పారిశుధ్య పనులపై కలెక్టర్ ప్రశాంతి క్షేత్రస్థాయి పరిశీలన



మఠం వీధిలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి చెత్త సేకరణ నూరుశాతం జరగాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో పారిశుధ్య పనులపై ఆమె క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సోమవారం నగరంలో ఐవీఆర్ఎస్‌లో పూర్ పెర్ఫార్మెన్స్ ఉన్న మఠం వీధిలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్నతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఈ కాలనీలో ఎన్ని గృహాలు ఉన్నాయో, ఎంత మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, సైడ్ డ్రెయిన్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. వారానికొకసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పైపులు, ఇతరత్రా ఆటంకాలు ఉంటే ఇంజనీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలని సూచించారు. ఇకపై ప్రతివారం ఐవీఆర్ఎస్ జరుగుతుందని, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కాలనీవాసులతో కలెక్టర్ మాట్లాడారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు కూడా వ్యక్తిగతంగా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం పంచుకుంటే నగరం మరింత సుందరీకరణ దిశగా అడుగులు వేస్తుందని సూచించారు. నగరంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ముందుకు వెళ్తున్నట్టు పేర్కొన్నారు.

టీడీపీ గోకవరం మండల అధ్యక్షుడిగా చంటిబాబు



గోకవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా వెదురుపాక గ్రామానికి చెందిన పిల్లా అర్జునసారధి (చంటిబాబు) నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జగ్గంపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చంటిబాబు నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

పుష్పలత పూల వర్తక సంఘం అధ్యక్షుడిగా దుర్గారావు



కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడియపుసావరం పుష్పలత పూలవర్తక సంఘం అధ్యక్షుడిగా జనసేన పార్టీకి చెందిన గంధం దుర్గారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక పూల వర్తక సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుర్గారావును ఉపాధ్యక్షుడిగా కేశవరపు అర్జున్, సెక్రటరీగా మంగిన దుర్గారావు, జాయింట్ సెక్రటరీగా వరగోగుల శ్రీను, జ్యోతుల వీరబాబు, మరో 14 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి సంఘ గౌరవాధ్యక్షుడు వరగోగుల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు చెక్కపల్లి మురళి, అన్నందేవుల చంటి, నాయకులు ఆకుల శ్రీధర్, ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, తుమ్మిద వరహాలరాజు శుభాకాంక్షలు తెలిపారు.

మస్‌జిద్ ఏ కౌసర్ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీకి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కడియం మస్‌జిద్ ఏ కౌసర్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఎంపిక చేసింది. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులు నియామక పత్రాలు అందుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీమ్, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్, సెక్రటరీగా షేక్ ఖాన్‌షరీఫ్, జాయింట్ సెక్రటరీగా షేక్ హుస్సేన్,ట్రెజరర్‌గా ఎండీ మదీనాబాషా, మరో నలుగురు సభ్యులుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నూర్‌భాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, వెలుగుబంటి నాని, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సహాయం అందించాలన్న ధ్యేయంతోనే ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామవరంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో వివిధ కారణాలతో చికిత్స చేయించుకున్న 17 మందికి రూ.12.79 లక్షల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో చికిత్సలు ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య పథకం ద్వారా అందిస్తున్నప్పటికీ అనేక మంది పేదలకు పథకంలో వర్తించని చికిత్సలకు సీఎం సహాయ నిధి ద్వారా సహకారం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు 'రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం!'

కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10-30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం! కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్ పాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉద్యోగుల హక్కులే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం బకాయి ఉన్న రూ.30 వేల కోట్లు, పీఆర్సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవులు తదితర ప్రధాన డిమాండ్ల కోసం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యల కోసం వినూత్న కార్యక్రమం చేపట్టారని అదే రండి: టీ తాగుతూ మాట్లాడుకుందాం... అని విల్సన్‌పాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో నిర్దిష్టమైన స్పష్టత ఉండాలని నగరపాలక సంస్థ సెక్రటరీ శైలజ వల్లి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆమె ప్రజల నుంచి 26 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా శైలజ వల్లి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారించాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ఇంజనీరింగ్ శాఖకు 7, రెవెన్యూశాఖకి 2, టౌన్ ప్లానింగ్‌కు 8, పబ్లిక్ హెల్త్‌కి 2, వార్డు సచివాలయానికి 4, అడ్మినిస్ట్రేషన్‌కు 1, అకౌంట్స్ కుచ మెప్మాకి 1 అర్జీ వచ్చిందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆ సంతకం నాది కాదు

బీజేపీ కన్వీనర్ నీరుకొండ

కోరుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోరుకొండ సీఐ సత్యకిషోర్‌పై రాష్ట్ర డీజీపీకి తాను ఎటువంటి ఫిర్యాదు చేయలేదని ఆ ఫిర్యాదుపై ఉన్న సంతకం తనది కాదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కోరుకొండ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే నెలలో తాను కోరుకొండ సీఐ సత్యకిషోర్‌పై డీజీపీకి తాను ఫిర్యాదు చేసినట్టు దీనిపై తనను ఇటీవల నార్త్‌జోన్ డీఎస్పీ వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారన్నారు. బీజేపీని, తన పేరును దుర్వినియోగం చేసి డీజీపీకి తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టప్రకారం పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి నాయకుల మధ్య బీటలు తేవడానికి ఎవరో తప్పుడు ఫిర్యాదు చేసి ఉంటారన్నారు. తన స్వగ్రామం సీతానగరం మండలం వెదుళ్లపల్లి అని, ప్రస్తుతం రాజమండ్రిలో నివాసం ఉంటున్నానని, డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో తన గ్రామం సీతానగరంగా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం ధర ఎక్కువగా ఉన్నందున దొంగతనాలు ఎక్కువగా జరగుతున్నాయని బయటకు వచ్చే సమయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. ఇల్లు విడిచి బంధువుల ఇంటికి వెళ్లవలసి వస్తే బంగారం, వెండి ఆభరణాలను భద్రపర్చుకోవాలన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున సెల్‌ఫోన్‌లో ఏ విధమైన లింక్‌లు ఓపెన్ చేయరాదని అన్నారు. ముందుగా జాగ్రత్త పడకపోతే బ్యాంకు అకౌంట్ ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సార్ మేడమ్
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: కింగ్‌డమ్
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ(సాయికృష్ణ)	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: సన్ ఆఫ్ సర్దార్-2
రంభ	: జూనియర్
కుమారి	: ----
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
వీఎస్ మహల్(నామవరం)	: కింగ్‌డమ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కింగ్‌డమ్
వెంకటసూర్య(కడియం)	: కింగ్‌డమ్
సత్యగౌరి (అనపర్తి)	: మహావతార్ నరసింహ
సూర్యశ్రీ (అనపర్తి)	: హరిహర వీరమల్లు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కింగ్‌డమ్
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కింగ్‌డమ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహావతార్ నరసింహ
లలితామహల్(రంపచోడవరం)	: హరిహర వీరమల్లు
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు





గేటు దాటాలన్నా.. టైమింగ్స్!





ఈ గేటుకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.. ఒకరోజు మూసేసినా వేలాది మందికి ఇబ్బంది తప్పదు.. ఉభయగోదావరి జిల్లాల ప్రజానీకం ఈ గేటు దాటకుండా ఉండరు.. అందుకే నిత్యం రద్దీగానే ఉంటుంది.. ఇంతకీ ఈ గేటు ఎక్కడిదంటే నిడదవోలు రైల్వే గేటు.. రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లి గూడెం వెళ్లాలన్నా తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం రావాలన్నా ఇదే దగ్గరి దారి కావడంతో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తారు. ఈ రైల్వే గేటును బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైల్వే గేటు వద్ద మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా గేటు మూసి వేస్తున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. - **నిడదవోలు**

మేలుకొలుపు!

ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్ అండ్ గో



అర్ధరాత్రి వేళ వాహనాలు తనిఖీ చేసి నిద్రమత్తులో ఉన్నడ్రైవర్లతో ఫేస్ వాష్ చేయిస్తున్న పోలీసులు

రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి.. ప్రమాదం ఎలా జరిగిందో కూడా అంచనా వేయడం కష్టంగా మారుతోంది.. రాత్రి వేళ రోడ్డు ప్రమా దాలు జరగడానికి నిద్ర మత్తే కారణమని అధికారులు తేల్చారు. దానిని అధిగమించడం ఎలా.. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్నట్టు.. ఈ సమస్యకు పరిష్కారం చూపారు. ఎలాగో తెలుసా..మీరే చదివేయండి మరి.. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ప్రజలకు భద్రతపై మరింత భరోసా కల్పించే దిశగా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు వాహన తనిఖీలు చేస్తున్నాయి.. జాతీయ రహదారిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. డ్రైవర్లను ప్రశ్నించి, వారి పరిస్థితిని అంచనా వేసి ప్రయాణానికి అనుమతిస్తున్నారు. నిద్రలోకి జారుకుంటారని అనుమానం వస్తే వెంటనే వాహనాన్ని కొంతసేపు నిలిపివేసి డ్రైవరు రెస్ట్ తీసుకునే విధంగా చూస్తున్నారు. డ్రైవర్ల ముఖాన్ని నీటితో కడిగించి పంపిస్తున్నారు. దీని కోసం 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. డ్రైవర్లు ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించరాదని, నిద్ర వస్తుందనుకుంటే హైవేల పక్కన ఉంటే ఉచిత పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాన్ని నిలిపి విశ్రాంతి తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. - **రాజమహేంద్రవరం**

వానలు రాక.. వరద పెరగక!

ధవళేశ్వరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వానలు రాక.. గోదావరి పెరగడంలేదు.. గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంది. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 1,78,415 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 5వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టా ప్రధాన పంట కాలువకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 7 వేల క్యూసెక్కులు చొప్పున మొత్తం 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 19.90 అడుగులకు చేరుకుంది.

అన్నదాత సుఖీభవ రాని ఖాతాలపై నివేదిక ఇవ్వండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ జమకాని ఖాతాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు.జేసీ చిన్నరాముడు, వ్యవసాయ, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో సోమవారం ఉదయం సమీక్షించారు. కొంతమంది రైతుల ఖాతాల్లో నిధుల జమకాకపోవడంపై ఫెయిల్డ్ కేటగిరీలను స్పష్టంగా గుర్తించాలన్నారు. గ్రామ పంచాయతీ, రైతు సేవా కేంద్రాల వారీగా పరస్పర పొంతన లేని వివరాలను గుర్తించి వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఫెయిల్డ్ కేటగిరీల క్రింద గుర్తించబడిన వాటిలో ఆధార్ వివరాలు సరిలేకపోవడం, బ్యాంకు ఖాతాకు అనుసంధానం కానపోవడం, ఎన్‌పీసీఐ పేమెంట్ పెండింగ్, మరణించిన లబ్ధిదారులు, తాత్కాలిక భూయాజమాన్య ధ్రువీకరణ పత్రం, భూవివాదాలు, సర్వేకాని భూములు, జాయింట్ ఎల్‌పి లావాదేవీలు కారణాలుగా గుర్తించినట్టు తెలిపారు. ఈ లోపాలను తహశీల్దార్ స్థాయిలో గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మరణించిన లబ్ధిదారుల వారసులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలివిడతలో జమకాని రైతులకు రెండో విడత రెండూ కలిపి జమ చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఈడీ ఎంసీ సతీష్, రాజమహేంద్రవరం రూరల్,పెరవలి, గోకవరం, రాజానగరం తహశీల్దార్లు,ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 15న శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న నిర్వహించే వేడుకల్లో ప్రభుత్వ శకటాల ప్రదర్శన అత్యంత ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధిని చూపించాలన్నారు.

రియల్ చాన్స్!

మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్



- అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ
- కూటమి సర్కారు అవకాశం
- జూలై 26న నోటిఫికేషన్
- 90 రోజుల పాటు అమలు
- గతంలో 10,366 అప్లికేషన్లు
- 6,080 దరఖాస్తులకు ఓకే
- రియల్టర్ల ఆనందం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గతంలోను అవకాశమిచ్చినా ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది.అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా దానికి కొన్ని సవరణలు చేస్తూ గత నెల 26న దీనికి సంబంధించి జీవో విడుదల చేసింది. అందులో ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్టరయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీనికి అక్టోబరు 24వ తేదీ వరకు గడువు ఇచ్చింది. దరఖాస్తుదారులకు ప్రభుత్వం పలు రాయితీలను ప్రకటించింది.

గతంలో 10,366 మంది దరఖాస్తు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అక్రమ, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గతంలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.47.98 కోట్ల పాక్షిక అపరాధ రుసుం చెల్లించారు. వీటిలో 6,080 దరఖాస్తులు అప్రూవల్ అయ్యాయి. 990 దరఖాస్తులు తిరస్కరించారు. 1327 దరఖాస్తులకు షార్ట్ ఫాల్ నోటీసులు ఇచ్చారు. 379 దరఖాస్తుదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. 1580 దరఖాస్తులు ఇంకా పెం డింగ్‌లో ఉన్నాయి. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది.దీనికి కొన్ని సవరణలు చేసి 2025 జూన్ 30లోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవోఎంఎస్ నెం.134ను 2025 జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90 రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే నేరంగా పరిగణిస్తారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అనధికార లే అవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వంటి వసతులు కల్పించరు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. అనధికార లే అవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్‌శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేస్తారు. దీంతో అమ్మకం, కొనుగోలు ఇతర లావాదేవీలు జరపడం యాజమానులకు సాధ్యం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అక్టోబరు 24 వరకు అవకాశం



అనధికార లే అవుట్లు,ప్లాట్ల యజమానులకు గుడ్ న్యూస్.. అక్టోబరు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవాలి.

రాహూల్ మీనా, జేసీ, వైస్ ఛైర్మన్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకినాడ

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా), రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా),అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో అర్హత కలిగిన అనధికార లేఅవుట్ల యజమానులు, అనధికార లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమ అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్ https:// dtcp.ap.gov.in వెబ్‌సైట్‌లో నేరుగా సిటిజన్ లాగిన్ లేదా ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో లైసెన్సు పొందిన ఎల్టీపీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రాయితీలు..

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50శాతం రాయితీ పొందుతారు.సెప్టెంబరు 19వ తేదీలోపు ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 5 శాతం తగ్గింపును పొందుతారు. 4 వేల చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు ప్రభుత్వ రహదారి, ఇప్పటికే ఉన్న రహదారి సదుపాయం కలిగి అనధికార లేఅవుట్లలో భాగం కాకపోతే వాటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం కలుగుతుంది. రాయితీలు పొందొచ్చు.





ధర్నా చేసి.. సంతకాల సేకరణ

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తే వ్యతిరేకించాలని ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక పిలుపునిచ్చారు.పీవోడబ్ల్యు, ఐఎఫ్ టీయుల సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వూరులో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఇందిరమ్మకాలనీలో నిరసన పదర్శన చేశారు.అదానీ స్మార్ట్ మీటర్లను బిగించరాదని, ట్రూఅప్ చార్జీ లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరిగే రాష్ట్రవ్యాప్త ధర్నాలో ప్రజలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మ కుమార్, ఆర్.హరీష్, శ్రీనివాస్, మున్నా, బాషా తదితరులు పాల్గొన్నారు.

12న నులిపురుగుల నివారణ దినం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. ఆ రోజున 1-19 ఏళ్ల పిల్లలకు ఉచిత ఆల్బెండజోల్ (డీ వార్మింగ్) మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మాత్రలు మింగేలా చూడాలని కోరారు. నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, శారీరక వృద్ధి సరిగా లేకపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయన్నారు.



నులిపురుగుల నివారణపై ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అంగన్‌వాడీల హాల్‌సెల్!

పాత ఫోన్లు వద్దంటూ నిరసన ప్రదర్శన



తాళ్లపూడిలో..

- సక్రమంగా పనిచేయని ఫోన్లు
- తిరిగిచ్చేసిన అంగన్‌వాడీలు
- నెట్ వర్క్ అందక ఇక్కట్లు
- గంటల తరబడి ఫోన్లతో కుస్తీ
- యాప్‌ల భారం తగ్గించాలి
- జీతాలు పెంచాలని డిమాండ్
- కొత్త ఫోన్లు వెంటనే ఇవ్వాలి

కొవ్వూరు/గోపాలపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేతకు గురిచేస్తున్నాయని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు,తాళ్లపూడి, గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద సోమవారం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సెల్‌ఫోన్లను సీడీపీవోలకు అప్పగించారు. కనీస వేతనాలు అందించే వరకు రికార్డు వర్క్ మాత్రమే చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వం 2022వ సంవత్సరంలో అందించిన సెల్‌ఫోన్లు 90 శాతం పాడైపోయి నెట్‌వర్క్ అందడంలేదని పేర్కొన్నారు. యాప్‌ల భారాన్ని మోయలేకపోతున్నామని సాంకేతిక సమస్యల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. మొబైల్‌లో పోషణ, ట్రాకర్, సంజీవిని, విల్క్, టీఎస్‌ఆర్ యాప్‌లు అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్ నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బంది అవుతుందన్నారు.గర్భిణుల విషయంలో నెలకు రెండు సార్లు టీఎస్‌ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండడం లేదని స్కానింగ్ చేసే సమయంలో సిగ్నల్ అందక, ఎక్కువ యాప్‌ల వల్ల ఫోన్ సరిగా పనిచేయడం లేదన్నారు.గర్భిణు లకు రోజువారీ పోషకాహారం అందించే సమయంలో వారి శారీరక మార్పుల కారణంగా వారి పాత ఫొటో స్కానింగ్ అవ్వడం లేదన్నారు. ఈ యాప్‌ల అదనపు భారానికి తోడు ఫించన్ల పంపిణీ సైతం తమకే కేటాయి స్తున్నారని వాపోయారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జూలై నెలాఖరుకు కొత్త ఫోన్లు ఇస్తామన్నారు. ఆగస్టు వచ్చినా ఇవ్వకపోవడంతో పాత ఫోన్లను సీడీపీవోకు అప్పగించామన్నారు. అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించకపోవడం అన్యాయమన్నారు.పనిచేయని సెల్‌ఫోన్లు మాకొద్దంటూ గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లపై పేర్లు రాసి సీడీపీవో మమ్మీకి అందజేశారు.



కొవ్వూరులో..



గోపాలపురంలో

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

జిల్లా కలెక్టరేట్‌లో 193 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రతి సోమవారం జరుగుతున్న పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వస్తున్న సమస్యలు గడువులోగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో 193 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, ఎస్‌డీసీ భాగ్యలక్ష్మి, సీపీవో ఎల్.అప్పల కొండ, డీఎల్‌డీవో ఏ స్లీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను పిలిచి ఆదేశాలిస్తున్న ఎంపీడీవో

ఎస్పీ గ్రీవెన్స్‌కి 35 ఫిర్యాదులు



ఎస్పీకి సమస్యను విన్నవిస్తున్న రైతులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. వివిధ అంశాలకు సంబంధించి 35 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

మన్నించు..మహాత్మ

సీతానగరం,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మన్నించు మహాత్మ..నీకా ఈ సమస్య.. అంటూ అధికారులే ఆశ్చర్యపోయారు.మహాత్మ గాంధీ నడయాడిన చారిత్రాత్మక కస్తూర్బా గాంధీ ఆశ్రమానికి బెల్ట్‌షాపుల బెడద ఎక్కువైంది.ఈ మేరకు సీతానగరంలోని ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆశ్రమం సమీపంలో బెల్ట్‌షాపులు జోరుగా జరుగుతున్నాయని అక్కడ తాగిన మద్యం సీసాలు, గ్లాసులు ఆశ్రమంలో విసిరేస్తున్నారన్నారు.విచ్చలవిడిగా బెల్ట్‌షాపులున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.ఈ మేరకు ఎంపీడీవో భారతి సీతానగరం పోలీసులను సంప్రదించి ఆశ్రమానికి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

పైడిమెట్ట..సాగునీరెట్లా!

సాగు నీరందక రైతుల ఇక్కట్లు ట్రాన్‌ఫార్మర్ ఏర్పాటుకు డిమాండ్



కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న పథకం నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం స్టేజ్-1లో గత నెల 27న కాలిపోయిన 75 కె.వి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించాలని పథ కం ఛైర్మన్ ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్‌ను కోరారు.కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో రైతులు వినతిప త్రం అందజేశారు.పైడిమెట్ట ఎత్తిపోతల పథకం కింద మండంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, సూరయ్యపేట, ప్రక్కిలంక, కుక్కునూరు, వీరభద్రపురం, వేగేశ్వరపురం, తుపాకులగూడెం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక, వర్షాలు సరిగా పడకపోవడంతో సాగునీరందే దారి లేక వరిచేలు బీటలు వారుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణకు రూ.12.39 లక్షల నిధులు మంజూరు చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు.కలెక్టర్‌ను పథకం ఛైర్మన్ ముళ్ళపూడి రామచంద్రరావు, ఉపాధ్యక్షులు గన్నిన సత్తిబాబు, మండా గోవిందు, వీరమళ్ళ బంగార్రాజు కలిశారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు

సత్వరం పరిష్కరిస్తాం

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డివిజినల్ పీజీఆర్ఎస్‌లో 16 ఫిర్యాదులు స్వీకరించినట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజినల్ పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆర్డీవో సుస్మిత 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సోమవారం డివిజినల్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి డివిజనల్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను తమ మండల కేంద్రాలలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. కెఆర్‌సీ తహసీల్దార్ అచ్యుతకుమారి వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం

మోయలేకపోతున్నాం

● గోడు వెళ్లబోసుకుంటున్న అంగన్‌వాడీలు

తాళ్లపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పరిధిలో పనిచేసే అంగన్‌వాడీ వర్కర్లు కేంద్రాల నిర్వహణలో పెరిగిన యాప్‌ల భారాన్ని మోయలేకపోతున్నామని సాంకేతిక సమస్యల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అంగన్‌వాడీలు వాపోతున్నారు.తమ డ్యూటీలతోపాటు యాప్‌ల నిర్వహణ పెద్ద భారంగా మారిందని అన్నారు. మొబైల్‌లో పోషణ, ట్రాకర్, సంజీవిని, విల్క్, టీఎస్ఆర్ యాప్‌లు అప్‌లోడు చేసే సమయంలో ఫోన్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంవల్ల పనిఆగిపోతుందని తెలిపారు. గర్భిణుల విషయంలో నెలకు రెండుసార్లు టీఎస్ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండటంలేదని స్కానింగ్ చేసే సమయంలో సిగ్నల్ సరిపోకపోవటం, ఎక్కువ యాప్‌లవల్ల ఫోన్ సరిగా పని చెయ్యడంలేదు. గర్భిణులకు రోజూవారీ పోషకాహారం అందించే సమయంలో వారి శారీరక మార్పుల కారణంగా వారి పాత ఫొటో స్కానింగ్ అవ్వడంలేదన్నారు. ఈయాప్‌ల అదనపు భారానికి తోడు పించన్ల పంపిణీ సైతం తమకే కేటాయిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ అనుబంధ సంస్థగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల సంఘం సీడీపీవో కేంద్రంలో తమ ఫోన్లను అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

తాడిపర్రులో రీ సర్వేకు రికార్డులు సిద్ధం

ఉండ్రాజవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు గ్రామంలో రీ సర్వే కార్యక్రమంలో భాగంగా సోమవారం సిబ్బంది రికార్డులను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. గ్రామంలో 1425 ఎకరాలకుగాను, 1300 మంది రైతులకు సంబంధించి రీ సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వీఆర్వోలు లక్ష్మీనరసమ్మ, చిట్టిబాబు, రాజ్యలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం!'

కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10-30గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం! కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉద్యోగుల హక్కులే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యల కోసం వినూత్న కార్యక్రమం చేపట్టారని విల్సన్‌పాల్ తెలిపారు.



దేవరపల్లిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు



తాళ్లపూడిలో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న డాక్టర్లు, అధికారులు

బిడ్డపుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టాలి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో మమ్మీ

దేవరపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రిపాలు పట్టాలని దీని వలన తల్లి, బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో మమ్మీ అన్నారు. దేవరపల్లిలో తల్లిపాల వారోత్సవంలో భాగంగా దేవరపల్లిలో అంగన్వాడీ కార్యకర్తలకు, గర్భవతులకు, బాలింతలకు రైతుభరోసా కేంద్రం వద్ద సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మమ్మీ మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి క్యాన్సర్, ఇతర ఎలర్జీలు రాకుండా కాపాడుకోవచ్చని తల్లిపాలు బిడ్డలకు వ్యాధినిరోధక శక్తితోపాటు తెలివైన ప్రయోజకుడిగా ఎదుగుతారని అన్నారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో సత్యవతి, సీహెచ్ఎస్‌పీ విజయలక్ష్మి, అంగన్వాడీ సెంటర్ సూపర్‌వైజర్స్ ఎం.విజయలక్ష్మి, ఎం.శశికళ,విజయశాంతి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యమని వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ సృజన పేర్కొన్నారు. కాల్దరి గ్రామంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాలొని మాట్లాడారు. బిడ్డకు పుట్టినప్పటి నుంచి తల్లిపాలు ఇస్తే మంచి ఆరోగ్యం కలుగుతుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.సుభాషిణి, వైద్యసిబ్బంది జి.రత్నకుమారి, డి. అనూష, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. వడ్లూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

తాళ్లపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపూడి మలకపల్లి సెక్టార్లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారో త్సవాలు నిర్వహించారు. మలకపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్ర మంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు అన్నపూర్ణ, సుచందనలు పాల్గొని చంటి పిల్లలకు తల్లిపాలు వలన కలిగే ప్రయోజనాల ను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు భానుమతి, భాగ్యకుమారి, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

దేవరపల్లి మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వేసవిని తలపిస్తున్న ఎండలు తాగు, సాగునీటికి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు అందించడానికి అదనపు మోటార్లు కొనుగోలు చేశారన్నారు. గ్రామాల్లో తాగునీటితో పాటు పారిశుధ్యంపైన ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులు డ్రాపవుట్‌ను తగ్గించాలని, విద్యాకమిటీల ద్వారా స్కూల్ మానేసిన విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా చూడాలని ఎంఈవోకి తెలిపారు. దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్.వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు టౌన్‌ఫీడర్ ఏర్పాటుచేసి 24గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేయడం జరిగిందని చాలా వరకు అన్ని గ్రామాలు పూర్తయ్యాయన్నారు. పంచాయతీ తాగునీటి బోర్లులు ఊరికి దూరంగా రెండు, 3కిలోమీటర్ల దూరంలో ఉండటం వలన వ్యవసాయరంగానికి ఇచ్చే విద్యుత్ ఆ బోర్లుకు ఇవ్వడం వలన 24గంటల విద్యుత్ సరఫరా లేక తాగునీరుకు ఇబ్బంది అవుతుందని పంచాయతీకి సంబందించి అన్ని బోర్లుకు ప్రత్యేకలైన్లు ఏర్పాటుచేసి 24గంటలు విద్యుత్ అందజేస్తామన్నారు. రైతులు పామాయిల్, కొబ్బరి తోటల రైతులు విద్యుత్‌కు అంతరాయం లేకుండా స్వచ్ఛందంగా కొమ్మలు నరుకుకోవాలని సూచించారు. లేనిపక్షంలో తాము పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చెట్లుకొమ్మలు తొలగిస్తున్నట్లు తెలిపారు. యర్నగూడెం విద్యుత్‌శాఖ ఏఈ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, కుటుంబాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. అలాగే ప్రధానమంత్రి సూర్యగర్ పథకం ద్వారా సోలార్ ఏర్పాటుకు రూ.లక్షా50వేలతో ఉచితంగా ఏర్పాటు చేస్తామని దీన్ని ఎస్సీ, ఎస్టీ సభ్యులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. సోలార్ ఏర్పాటు చేయడంతోపాటు 2400రెంట్ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ 60సంవత్సరాలు దాటిన వారికి వ్యాంగులకు రేషన్‌బియ్యం ఇంటివద్దకే అందజేస్తామని అర్హులైన వారికి 3సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వడానికి అప్లికేషన్లు పెట్టుకోవాలని తెలిపారు. ఎంఈవో తిరుమలదాసు మాట్లాడుతూ విద్యార్థులు గతేడాది కంటే 400మంది వరకు విద్యార్థుల సంఖ్య తగ్గిందని దీనికిగల కారణాలు కూడా ఉపాధ్యాయులు విద్యాకమిటీల ద్వారా తెలుసు కుంటామని డ్రాప్ అవుట్స్ తగ్గిస్తామని తెలిపారు. విద్యాశాఖాధికారి కె.కమలరాజు మాట్లాడుతూ మండలంలో 8500ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉండగా 8350 ఎకరాల్లో నాట్లు వేశామన్నారు. ప్రతీరైతు ఈపంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బిరా జారావు, వైస్ఎంపీపీలు కె.అరుణ, సాదే సుబ్బా రావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పల్లా దానయ్య

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి

పెరవలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం అది. గ్రామంలో చిన్న చిన్న కరెంటు పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో సహా భార్యను పోషించుకుంటూ ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబంలో విద్యుత్ షాక్‌తో ఆ యువకుడు మృత్యువాత పడ్డాడు. దీంతో అతనిపై ఆధారపడ్డ ఆ కుటుంబం వీధిన పడింది. కానూరు అగ్రహారంలో పల్లా దానయ్య (42) అనే యువకుడు గ్రామంలో ఇళ్ల వద్ద విద్యుత్ పనులు చేసుకుంటూ అందరితో కలిసిమెలసి జీవిస్తుంటాడు. ఎవరు ఎప్పుడు పిలిచినా వెళ్లి వారి పనులు చక్కబెట్టేవాడు. ఇదే క్రమంలో గ్రామంలో కేబుల్ వైర్లు కట్టేందుకు కూడా అతనిని పిలవడంతో వెళ్లాడు. ఒకవిద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అదే స్తంభంపై కేబుల్ వైర్లు కట్టడానికి స్తంభం ఎక్కాడు. దీంతో షాక్‌కు గురైన ఆ యువకుడు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ధనలక్ష్మితోపాటు చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో ఆ కుటుంబం బాధ వర్ణణాతీతంగా మారింది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

ఖాళీ స్థలాలను శుభ్రం చేయండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో విషపురుగులకు ఆవాసాలుగా మారిన ప్రైవేటు ఖాళీస్థలాలను శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భావనరత్నకుమారి సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో సచివాలయ అడ్మిన్, శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పట్టణంలో చిట్టడవులను తలపిస్తున్న ఖాళీస్థలాలు శీర్షికపై చర్చించారు. ఈనెల 14వ తేదీ నాటికి పట్టణంలోని 23 వార్డులలో ఉన్న ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపునీరు నిలిచి రంగుమారి దుర్వాసన వెదజల్లుతున్న స్థలాలను లెవిలింగ్ చేసుకునేలా స్థలాల యజమానులకు నోటీసులు అందజేయాలన్నారు. స్పందించిన య జమానులపై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ వర్షాకాలంలో పిచ్చిమొక్కలు పెరిగి పరిసర ప్రాంతాలకు అసౌకర్యాన్ని కలుగజేస్తున్నాయన్నారు. విష పురుగు లు, పాములు సంచరిస్తున్నాయన్నారు. ఖాళీస్థలాల యజమానులు తమ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పురపాలక సంఘానికి తోడ్పాటునందించాలన్నారు. కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. బి.భరత్‌కుమార్, రవి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పదర.. పదర.. పదరా..



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చిన యువకులు

● ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన యువత

● కాకినాడలో సోమవారం అర్ధరాత్రి మొదలైన ర్యాలీ

● కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు

కాకినాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యువతరం తరలివచ్చింది. ఆర్మీ కొలువు కోసం కదిలి వచ్చింది. భుజాన బరువైన బ్యాగులతో కాకినాడలో అడుగుపెట్టింది. దీంతో కాకినాడ జిల్లా క్రీడామైదానం మరోసారి కిటకిటలాడింది. కాకినాడ నగరంలోని జిల్లా క్రీడామైదానంలో సోమవారం అర్ధరాత్రి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ ప్రారంభమైంది. ఇప్పటికే తొలిదశలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్యాండెట్ అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన పదివేలమంది యువత రెండో దశ ఎంపిక కోసం కాకినాడ జిల్లాకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో మొత్తం 12 జిల్లాలతోపాటు యానాం అభ్యర్థులు కూడా పాల్గొనన్నారు. తేదీల వారీగా ఆయా జిల్లాల వారికి ఈవెంట్లు జరగనున్నాయి. ఆగస్టు 5వతేదీ అల్లూరిజిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు శారీరక దారుఢ్యపరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా జిల్లాల అభ్యర్థులు సోమవారం రాత్రి పదిగంటలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనకాపల్లి, యానాం, పార్వతీపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ జిల్లాల అభ్యర్థులకు తర్వాత తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా తరలివచ్చిన అభ్యర్థులకు జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

రాత్రి ఒంటి గంటన్నర నుంచి..

తొలుత కాకినాడ జిల్లా క్రీడామైదానం ప్రధాన గేటువద్ద నుంచి అడ్మిన్‌కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. తర్వాత కుడిపక్కన ఏర్పాటు చేసిన టెంట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దూరప్రాం తాలనుంచి వచ్చే విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు గుడారాలను ఏర్పాటుచేశారు. భోజన ం, వసతి కల్పించారు. రాత్రి ఒంటి గంటన్నర దాటిన తర్వాత నుంచి 1.6 కేఎం పరుగు, ఇది 6.15 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో ఎంపి కైన వారు ఎత్తు, బరువు, ఛాతీ, లాంగ్‌జంప్, జిగ్‌జాగ్, బ్యాలెన్స్, పుష్ అప్స్ వంటి ఫిజికల్ ఫిటెనస్ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ టెస్టులు, తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటాయి.

పుట్టినరోజు వేడుకలకు వెళుతూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన మహావీర సాయినవీన్

దేవరపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెదనాన్న మనవడు పుట్టినరోజు వేడుకకు వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన దేవరపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరం వెంకటనగర్‌కు చెందిన చెలమశెట్టి మహావీర సాయినవీన్ (25) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలోని శ్రీలక్ష్మితులసి ఆగ్రో పేపర్ మిల్లులో డీసీఎస్ ఆపరేషన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరంలోని పెదనాన్న మనవడు పుట్టినరోజు వేడుకకు అశ్వారరావుపేట నుంచి సోమవారం ఉదయం 11గంటలకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో గౌరీపట్నంలో జాతీయ రహదారివద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరేళ్ల క్రితం మృతుడి తల్లిదండ్రులు మృతి చెందారు. మృతుడికి తమ్ముడు శివశంకర్, రాజమహేంద్రవరంలో ఉంటూ డెకరేషన్ వర్కు చేస్తున్నాడు. మృతుడి మృతదేహాన్ని గోపా లపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తర లించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

వృద్ధురాలికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాపనమ్మకు సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేదప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం పట్టణానికి చెందిన చేబోలు బాపనమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.35,000ల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, హనుమంతు, వరిగేటి కాంతరాజు పాల్గొన్నారు.

మోదీ 11 సంవత్సరాల పాలనపై కరపత్రాల పంపిణీ

తాళ్లపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో నరేంద్ర మో దీ పరిపాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు పిక్కీ నాగేంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన పథకాలను, పరిపాలన, ఈ దేశానికి బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండాల్సిన అవసరాన్ని తెలియచేసారు. అనంతరం మోదీ 11 సంవత్సరాల పాలనపై కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, గోకవరపు జితేంద్ర రవి, కిల్లాని వెంకటరమణ, ప్రగడ సత్యన్నారాయణ, నక్కా వెంకటేశ్వర రావు, బట్టు రమేష్, మరపట్ల వివేకానంద పాల్గొన్నారు.

తొలి అడుగు పూర్తిచేసుకున్న సందర్భంగా

నేడు విజయోత్సవ సభ

దేవరపల్లి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా దేవరపల్లి మండలంలో తొలిఅడుగు అన్ని గ్రామాల్లో నూరుశాతం పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం సాయం త్రం 4గంటలకు కరుటూరి ఫంక్షన్‌హాలు నుంచి కాకర్ల ఫంక్షన్‌హాలు వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొంటారని తెలిపారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

● 9వ అదనపు జిల్లా జడ్జి అనూరాధ



9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ

కొవ్వూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయాధికార సేవా సంస్థల ఆదేశాలమేరకు సెప్టెంబరు 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ తెలిపారు. సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ జాతీయ లోక్అదాలత్‌లో సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, భార్యాభర్తల భరణం, డొమస్టిక్ వయిలెన్స్ మోటారు వాహనాల ప్రమాదా లు, బ్యాంకు బకాయిలు, ప్రీలిటికేషన్, టెలిఫోన్ బకాయిలు, ప్రామిస రీనోట్‌లకు సంబంధించిన కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. జాతీయ లోక్అధాలత్‌లలో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులకు సమ యం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యాబోధన



బి.మేరీ సుజాత, ప్రిన్సిపాల్

నిడదవోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, అధ్యాపకుల కృషి కారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అడ్మిషన్లు పెరగడంతోపాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.మేరీ సుజాత అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గతేడాది 165 మంది విద్యార్థులు కాగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 260కి పెరిగిందన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యాబోధన, పబ్లిక్ పరిక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, ప్రభు త్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగ పడుతున్నాయన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీచేయడం వంటి కారణాలు ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల వైపు దృష్టి సారించాలని ఆమె కోరారు.

'సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మండల అధ్యక్షుడు కొర్లపాటి రామును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

గోపాలపురం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో మండల స్థాయిపార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొర్లపాటి రాము మాట్లాడుతూ గత ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలను మ్యానిఫెస్టో ద్వారా కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను ప్రభుత్వం పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేసిందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అమలు చేస్తున్నారని అన్నారు. అదేవిధం గా ఈనెల 7న జరిగే సుపరిపాలనలో తొలి అడుగు ఏడాది పండుగను కార్యకర్తలంతా విజ యవంతం చేయాలన్నారు. గ్రామాల నుంచి కార్యకర్తలను తీసుకొచ్చి కార్యక్రమంలో భాగస్వాములు చేయాలన్నారు. గ్రామస్థాయిలో అందర్నీ కలుపుకుని సంక్షేమపథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు గద్దే హరిబాబు, వేముల నాగరాజు, వడ్లమూడి రమేశ్, నూతంగి దొరబాబు, కాట్రగడ్డ సురేశ్, గంధ్రోతు శ్రీనివాసరావు, ముత్యాల రాయుడు, సీనియర్ నాయకులు గన్నిన మురళీ, పొదూరి రఘురామ్, నందమూరి సత్యానారాయణ, వాసు, ఏఎంసీ డైరెక్టర్లు కూనపం ప్రసాద్‌బాబు, కాశీం సాహెబ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్‌ఇన్‌చార్జ్‌లు భారీగా పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన హరి కుటుంబానికి సాయం అందజేత

గోపాలపురం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం బీసీ కాలనీలో లీవర్, రెండుకిడ్నీలు పాడవటంతో అనారోగ్యం భారీనపడిన కాదూరి హరి కుటుంబానికి మానవత సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మానవత మండల అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్ మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా అపన్నులకు ఆర్థిక సాయం చేస్తామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకంగా మానవత సంస్థ ఆర్థికసాయం అందజేస్తుందన్నారు.